'రైతుల పాలిట శాపంగా ప్రభుత్వ పాలన'




భూపాలపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న భారాస నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణలో రైతులకు మాజీ సీఎం కేసీఆర్ దేవుడైతే.. నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారినట్లు భారాస పట్టణ కమిటీ అధ్యక్షుడు కట్కం జనార్దన్, మండల కమిటీ అధ్యక్షుడు పన్నింటి రాజిరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు భరోసాపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి, భారాస జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం భారాస నాయకులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ ఏర్పడక ముందు కాంగ్రెస్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందేనన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసీఆర్ నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి బీడు భూములకు సాగునీరు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జంగేడు పీఏసీఎస్ ఛైర్మన్ మేకల సంపత్, నాయకులు రఘుపతిరావు, విద్యాసాగర్‌రెడ్డి, రాజు, ఖరీం, మురళీధర్, జక్కం రవి, కాసర్ల దేవేందర్‌రెడ్డి, రఘుపతి, నాంపెల్లి శ్రీనివాస్, కుమార్‌రెడ్డి కరాటే శ్రీను, చిరంజీవి, సురేందర్ పాల్గొన్నారు.

ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి

పెద్దదిక్కు లేక.. కన్నీళ్లు ఆగక!

అన్నదాతల ఆత్మహత్యలు.. కుటుంబాల్లో కల్లోలం



ఆరుగాలం కష్టపడుతూ.. చెమట ధారలతో నేలను తడుపుతూ సాగునే నమ్ముకున్న అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పెరుగుతున్న సాగు పెట్టుబడులు.. కుటుంబ పోషణ.. పిల్లల చదువులు.. వైద్య ఖర్చులకు చేస్తున్న అప్పులు తీరక తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ పది నెలల కాలంలో దాదాపు 25 మంది దాకా బలవన్మరణాలకు పాల్పడటం కలవరపెడుతోంది. వీరిలో కౌలు రైతులు కూడా ఉన్నారు. యువ రైతులు సైతం బలవన్మరణం చెందడంతో చిన్నతనంలోనే వితంతువులుగా మారిన మహిళలు అప్పులు ఎలా తీర్చాలో.. పిల్లలను ఎలా పెంచి పెద్దచేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాల దయనీయ పరిస్థితిపై కథనం.

ఈనాడు, మహబూబాబాద్

కౌలు రైతు కుటుంబం.. కష్టాలపాలు



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లికి చెందిన పోశాల రాజబాబు(45) వ్యవసాయంపై మక్కువతో పదేళ్లుగా మూడెకరాలు కౌలుకు తీసుకుని పంటల సాగు చేసేవారు. ఆశించిన దిగుబడులు రాక, అప్పులు పెరిగి సుమారు రూ.15 లక్షలకు చేరాయి. కుటుంబ పోషణ భారంగా మారడంతో రాజబాబు మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారులు సుశాంత్, అభిరామ్ చదువుల ఖర్చులతోపాటు అప్పులను తీర్చే బాధ్యత తనపై పడిందని.. కూలీ పనులకు వెళ్లినా కష్టాలు తీరేలా లేవని భార్య సువర్ణ రోదిస్తోంది. – వర్ధన్నపేట

అప్పులోళ్ల ఒత్తిడి భరించలేక..



వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆరెపల్లికి చెందిన గువ్వాడి మోహన్‌రావు(32), భార్య కృష్ణవేణి (28) మూడెకరాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేసేవారు.. దీంతోపాటు మోహన్‌రావు వరంగల్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తుండేవారు. రూ.3 లక్షల మేర అప్పు చేశారు. మోహన్‌రావు రోజు పనికి వెళ్లిన తర్వాత.. అప్పులోళ్లు ఇంటికి వచ్చి అడుగుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవకు దారితీసింది. అప్పులు తీర్చే మార్గం లేక మార్చి 3న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దిక్కుతోచని పరిస్థితిలో కృష్ణవేణి ఐదేళ్లు, రెండుసంవత్సరాల పిల్లలను నాన్నమ్మ వద్ద ఉంచి కూలికి వెళ్తోంది. – గీసుకొండ

అప్పుడు కూతురు.. ఇప్పుడు తండ్రి



భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన కొండ రాజబాపు(45) కౌలు రైతు.. నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేశారు. సుమారు రూ.11 లక్షలకు పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. ఆశించిన దిగుబడులు రాకపోవడం.. కుటుంబ పోషణ భారమవుతోందని వేదనతో రాజబాపు పురుగు మందుతాగి ఈ నెల 6న మృతి చెందారు. మూడేళ్ల కిందట పదో తరగతి చదువుతున్న కూతురు.. ఇప్పుడు ఇంటి యజమాని ఆత్మహత్య చేసుకోవడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. అప్పులు, కుమారుడికి చదువులు చెప్పించే బాధ్యత భార్య రాజేశ్వరిపై పడింది. కష్టాలు గట్టెక్కేందుకు గ్రామంలో కూరగాయలు విక్రయిస్తున్నాని.. కన్నీరు పెట్టుకుంది. –కాటారం

నమ్ముకున్న చేనులోనే..



భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పల్లుగ్రామానికి చెందిన పలిశెట్టి మొండయ్య(45) ఆరెకరం భూమిలో పత్తి సాగు చేసేవారు. భార్య లావణ్య కూలి పనులకు వెళ్లేది. మూడేళ్ల నుంచి గోదావరి వరద ముంపుతో సాగు చేసిన పత్తిలో దిగుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పెట్టుబడి, ఇంటి పోషణకు చేసిన రూ.8 లక్షల అప్పులో రూ.4 లక్షలు తీర్చారు. మిగతావి తీర్చేందుకు ఇబ్బందులు ఎదురవడంతో మనోవేదనకు గురై మొండయ్య పంట చేలోనే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. లావణ్య బాధను దిగమింగుతూ రోజూ కూలి పనులకు వెళ్తోంది. – కాళేశ్వరం

భూమి అమ్మి తీర్చేందుకు..



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం హరిదాస్‌తండా పంచాయతీ శివారు హర్యాతండాకు చెందిన భుక్యా హతీరాం(33), భార్య మనీష(28) ఎకరన్నర భూమికి తోడుగా మరో ఎకరన్నర కౌలుకు తీసుకుని మూడెకరాల్లో మిరపసాగు చేశారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మిరప తోటలో నీటి ఊట పెరిగి వేరుకుళ్లు తెగులు సోకి పంటంతా ఎండిపోయింది. పెట్టుబడికి రూ.2.50 లక్షలు, అంతకుముందు చేసిన పాత అప్పులు రూ.4 లక్షలు తీర్చడం కష్టమని భావించిన హతీరాం మనస్తాపంతో సెప్టెంబరు 6న పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాటి నుంచి మనీష కుటుంబ బాధ్యతను తీసుకుని రూ.40 వేలు అప్పు చేసి మళ్లీ మిరప సాగు చేస్తోంది. అప్పులు తీర్చడానికి 20 గుంటల భూమిని విక్రయించాలని అనుకుంటున్నానని రోదిస్తూ చెప్పింది. – కురవి

పరిష్కారాలు ఇలా..

- వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి
- ప్రత్యామ్నాయ పంటలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు భరోసా కల్పించాలి.
- మిర్చి, పత్తి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ముందస్తు సూచనలు చేయాలి.
- ఎరువులు, పురుగు మందుల ధరలు నియంత్రించి రైతులపై భారాన్ని తగ్గించాలి
- ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి.

రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- విజయ్ భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భూపాలపల్లి

వ్యవసాయంలో ఒడుదొడుకులు సహజం.. అనుకున్న దిగుబడి రాకపోవడం, అకాల వర్షాలు, వరదలతో పంట మునగడం వంటి సందర్భాల్లో ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి వ్యవసాయ శాఖ తరఫున సిద్ధంగా ఉన్నాం. చాలా మంది అన్నదాతలు అర్హత ఉండీ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవడం లేదు.. పంట సాగుకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు



మున్సిపాలిటీ కార్యాలయ భవనం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా భూపాలపల్లి పట్టణంలోని 30 వార్డులు, జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అనుమతితో కాంగ్రెస్ నేతలు కమిటీలను నియమించి మున్సిపల్ కమిషనర్‌కు జాబితా అందజేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. కమిటీల నియామకానికి అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

ఎవరికి అవకాశం కల్పిస్తారు..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 30 వార్డులు, జిల్లా వ్యాప్తంగా 241 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో సుమారు 90 శాతం గ్రామ పంచాయతీల్లో కమిటీలను నియమించినట్లు సమాచారం. జిల్లాకు తొలివిడతగా 7 వేల గృహాలను మంజూరు చేస్తారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపట్టారు. అయితే గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారికి ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించారు. ఇద్దరూ మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరి చొప్పున, కార్యదర్శి భాగస్వాములవుతారు.

☛ పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లో ఇద్దరూ మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరి చొప్పున సభ్యులుగా ఉంటారు. అదే విధంగా మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌తో పాటు ఆ వార్డు కౌన్సిలర్ సైతం సభ్యులుగా ఉంటారు. అంటే ఒక వార్డుల్లో ఏడుగురు సభ్యులతో కమిటీ వేశారు. మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డుల్లో 210 మంది సభ్యులను ఎంపిక చేసినట్లు అధికార పార్టీ నేతలు తెలిపారు.

ఇళ్ల మంజూరుకు నిబంధనలు..

❒ జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి ఉండాలి. ❒ పేద, మధ్య తరగతి వారై ఉండాలి. ❒ అద్దె ఇంట్లో ఉండే వారికి ప్రాధాన్యత కల్పించాలి. ❒ ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం కల్పించాలి. ❒ సొంత ఇంటి స్థలం కలిగి ఉండాలి.

విద్యార్థులకు ఎస్‌ఏ-I పరీక్షలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని సర్కారు, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలు 21 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి 5 వరకు ఆంగ్ల మాధ్యమంలో 10,358 మంది విద్యార్థులు, ఉర్దూ మీడియంలో 25 మంది, ఆరు నుంచి 10 వ తరగతి వరకు తెలుగు మీడియం నుంచి 216 మంది, ఇంగ్లిష్ మీడియం 17,426 మంది పరీక్షలు రాయనున్నారు. వచ్చే నెల 2న జవాబు పత్రాల మూల్యాంకనం అనంతరం ఫలితాలు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేలా ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు.

ఐటీఐలో ఖాళీ సీట్లకు తక్షణ ప్రవేశాలు

కాటారం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ కాటారంలో మిగిలిన సీట్లకు మౌఖిక పరీక్షల ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భిక్షపతి ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. నేటి నుంచి ఈ నెల 30 తేదీ ఉదయం 11 గంటలలోపు ధ్రువ పత్రాలతో కళాశాలలో హాజరు కావాలని కోరారు. డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్‌లో 24, కోపా 16 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదాత కష్టం నేలపాలు



కొర్లకుంట సమీపంలో నేలవాలిన వరి

మహాముత్తారం, కాటారం, న్యూస్‌టుడే : పలు గ్రామాల్లో శనివారం భారీ ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. మరో పది రోజుల్లో పొలాలు కోతకు సిద్ధమైన తరుణంలో ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్ర చేసింది. చేతికి వచ్చిన పంట నేలమట్టం కావడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. కాటారం, కొర్లకుంట, జీలపల్లి, మహాముత్తారం, వజినేపల్లి, స్తంభంపల్లి(పి.పి), ములుగుపల్లి, శివారులోని వందల ఎకరాల్లో పొలాలు నేలవాలాయి. గాలి తీవ్రతకు వందల ఎకరాల్లో పత్తి నేలవాలింది. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాక నష్టం మిగలనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

25, 26న ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడా పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. 25న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, నెట్‌బాల్, కరాటే, లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, క్రికెట్, ఈత, 26న ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చదరంగం, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, విలువిద్య, ఫెన్సింగ్.. వరంగల్ కాశీబుగ్గలోని ఓసిటీ మైదానంలో జూడో పోటీలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 98492 10746 సంప్రదించాలన్నారు.

కుమురం భీం ఆశయసాధనకు కృషి

మహబూబాబాద్ రూరల్ (గూడూరు), న్యూస్‌టుడే: ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కుమురం భీం ఆదివాసీల ఆశాజ్యోతి అని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. ఆదివారం గూడూరులో కుమురం భీం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమురం భీం పోరాట ఫలితంగా భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు 5వ షెడ్యూల్ రూపకల్పన చేశారన్నారు. అటవీ ప్రాంతంలో 1/59,1/70 చట్టం ప్రకారం పరిపాలన సాగించాలన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో అన్ని ఉద్యోగాలను ఆదివాసీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు బి.సారయ్య, కృష్ణమూర్తి, స్వామి, వెంకన్న, శ్రీనివాసు, దొర పటేల్ కారం లక్ష్మి, సుధాకర్ జనార్దన్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభ

మహదేవపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన పంతకాని రాజు ఇండియా ఫొటోగ్రఫీ-2024 లో ప్రతిభ కనబరిచాడు. మహారాష్ట్ర కొల్హాపూర్ ప్రాంతంలో జరిగిన పసుపు పండుగపై తీసిన ఛాయాచిత్రం జాతీయ ఉత్తమ చిత్రంగా, 2024 సమ్మిట్‌లో ప్రచురించినట్లు తెలిపారు. రాజు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పలువురు అభినందించారు.

అక్కడ ఎన్నికల కోడ్.. ఇక్కడ సమావేశం



అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పొరుగున ఉన్న మహారాష్ట్రలోని సిరొంచాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మహారాష్ట్ర అహిరి నుంచి భాగ్యశ్రీ ఆత్రం పోటీలో ఉండగా, ఆమె ఆధ్వర్యంలో కాళేశ్వరంలో ఆ ప్రాంత మహిళా కార్మికులు (సీఐటీయూ)లతో సమావేశమయ్యారు. పలు డిమాండ్ల సాధనకు పోరాడుతుండగా సిరొంచాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కాళేశ్వరం దేవస్థానం అతిథి గృహంలో కార్యక్రమం నిర్వహించారు. సిరొంచా తాలూకా నుంచి భారీగా మహిళా కార్మికులు తరలివచ్చారు.

– న్యూస్‌టుడే, కాళేశ్వరం(భూపాలపల్లి జిల్లా)

గొత్తికోయ గూడెంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: భూపాలపల్లి మండలం దూదేకులపల్లి శివారు గొత్తికోయగూడెంలో ఆదివారం భూపాలపల్లి ఎస్సై దాసరి సుధాకర్ ఆధ్వర్యంలో సివిల్, స్పెషల్ పార్టీ బృందాలు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టు భావజాలానికి కాలం చెల్లిందని వారికి ఎవరైనా సహకరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గొత్తికోయ కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు హరిస్తున్న లారీలు



మహదేవపూర్ మండలం బెగ్లూర్‌లో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ(పాతచిత్రం)

కాటారం, మహదేవపూర్ న్యూస్‌టుడే: జిల్లాలో వందలాది ఇసుక, బొగ్గు లారీలు అతివేగంతో ప్రయాణిస్తూ నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాహనదారులను బెంబేలెత్తిస్తూ ప్రాణాలను హరిస్తున్నారు. చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. లారీల అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, అధిక లోడుతో వెళ్లడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు. భూపాలపల్లి, తాడిచెర్ల బొగ్గు గనుల నుంచి రాత్రింబవళ్లు భారీ వాహనాల్లో బొగ్గు తరలిస్తున్నారు. మహదేవపూర్, పలిమెల మండలాల్లోని ఇసుక క్వారీల నుంచి ఇసుకను లారీల్లో హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు దాదాపు వెయ్యికి పైగా లారీలు అధిక లోడు, అతివేగంతో రాకపోకలు సాగిస్తూ ప్రయాణికుల పాలిట మృత్యుశకటాల్లా తయారవుతున్నాయి. దీంతో ప్రమాదాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

'మామూలు'గా తనిఖీలు..

జాతీయ రహదారిపై పోలీసు, రవాణా శాఖ అధికారుల పర్యవేక్షణ 'మామూలు' గానే మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో లారీ డ్రైవర్ల వేగానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. జాతీయ రహదారి వెంట ఉన్న గొలుసు మద్యం దుకాణాల్లో నిరంతరం విక్రయాలు సాగడం ఓ కారణం. మద్యం తాగి ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపడం.. చరవాణిలో మాట్లాడుతూ నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు నిరంతరం డ్రైవర్లకు కౌన్సెలింగ్, మద్యం తాగి నడపకుండా శ్వాస పరీక్షలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జాతీయ రహదారిపై ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే జాతీయ రహదారి వెంట ఉన్న గొలుసు మద్యం దుకాణాలను నియంత్రించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరిగిన సంఘటనలు..

☛ మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామ సమీపంలో ఈ నెల 17న ఇసుక లారీ ఢీకొని రమేష్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

☛ భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్-జంగుపల్లి మధ్య 16న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో పేరాల వెంకటేశ్వరరావు అనే యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

☛ ఈ నెల 9న మల్హర్ మండలం మల్లారం శివారులో డ్రైవర్ నిర్లక్ష్యంతో బొగ్గు లారీ ఢీకొని తాడిచెర్ల ఉపరితల గనిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌కు చెందిన జీ. శ్రీకాంత్ మృతి చెందాడు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

- కిరణ్ ఖరే, జిల్లా ఎస్పీ

నిబంధనల మేరకు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నాం. అతివేగం, అధిక లోడ్, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటాం. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలి.

సేవలు అమరం.. త్యాగం మరవం

● నేటి నుంచి పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు



పోలీసులు సమాజ రక్షకులు.. విధి నిర్వహణ కోసం కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ.. అనేక త్యాగాలు చేస్తారు. ప్రజలందరూ సంతోషంగా పండగలు జరుపుకొంటే ఆ సమయాల్లో తాము మాత్రం ప్రత్యేక విధులు నిర్వహిస్తారు. శాంతి భద్రత పరిరక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయరు. విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన ప్రధాన ఘటనలపై 'న్యూస్‌టుడే' కథనం.

వరంగల్‌క్రైం, వర్ధన్నపేట, న్యూస్‌టుడే

రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నక్సలిజం ఎక్కువగా ఉండేది. పోలీసులు, నక్సల్స్ మధ్య నిరంతరం ఎదురుకాల్పులు జరిగేవి. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎస్పీ నుంచి హోంగార్డు వరకు 61 మంది పోలీసులు అమరులయ్యారు. ప్రాణత్యాగం చేసిన వారిలో అయిదుగురు హోంగార్డులు ఉన్నారు.

ఠాణాలపై దాడులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులపై దాడులతో పాటుగా ఠాణాపై దాడులు చేసేవారు. ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఠాణాపై 2001 జులై 29న మావోయిస్టులు దాడి చేసి పేల్చేశారు. ఈ ఘటనలో ఠాణాలో పనిచేస్తున్న మోహన్‌నాయక్ మృతిచెందాడు. పక్కనే ఉన్న దేవాలయంలోని పూజారితో పాటు అటవీ శాఖ సిబ్బంది ఒకరు చనిపోయారు. 1991 ఏప్రిల్ 22న నగరం నడిబొడ్డున ఉన్న సుబేదారి ఠాణాను పేల్చేశారు. హెడ్‌కానిస్టేబుల్ టి.సారయ్య, కానిస్టేబుల్ కోటయ్య మృతిచెందారు. హనుమకొండ ఠాణాపైనా మావోయిస్టులు దాడి చేశారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పటి సీఐ గులాంసందానీ లక్ష్యంగా మావోయిస్టులు ఠాణాను పేల్చేశారు. ఈ ఘటనలో ప్రస్తుతం సీసీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న శివకుమార్ గాయపడ్డారు.

భార్యాబిడ్డలకు టాటా చెబుతూనే..



వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పార్కు

1997లో వర్ధన్నపేట ఠాణా ఎస్సైగా పనిచేస్తున్న రఘును నక్సల్స్ కాల్చి చంపారు. 1992లో పోలీసు ఉద్యోగంలో చేరిన రఘు ఉమ్మడి జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. వర్ధన్నపేట ఎస్సైగా ఉన్న సమయంలో 21-11-1997న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వచ్చారు. అదేరోజు సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఠాణాకు వెళుతూ.. కూతురు, భార్యకు టాటా చెబుతుండగానే ఇద్దరు వ్యక్తులు వచ్చి తుపాకీతో కాల్చారు. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. భార్యాబిడ్డల ముందే తుదిశ్వాస విడిచారు. ఆయన వీర మరణానికి గుర్తుగా వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో కొంత స్థలాన్ని పార్కుగా ఏర్పాటు చేసి రఘు పేరు పెట్టారు.

మాటువేసి మట్టుబెట్టారు..

భూపాలపల్లిలో 2001 సంవత్సరంలో సీఐగా పనిచేస్తున్న వివేకానందను నక్సల్స్ కాల్చి చంపారు. 1985లో పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన వివేకానంద నగరంతో పాటు జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా పనిచేశారు. సీఐగా పదోన్నతి రావడంతో బదిలీపై భూపాలపల్లికి వచ్చారు. సింగరేణి అతిథి గృహంలో రాత్రి భోజనం ముగించుకొని జీపులో ఠాణాకు వెళుతుండగా.. మార్గంమధ్యలో మాటు వేసిన ఇద్దరు వ్యక్తులు ఒక్కసారి వచ్చి నేరుగా సీఐపై కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.

1991లో తొలి పేలుడు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1991 జూన్ 15న మొదటిసారిగా మందుపాతర పేలింది. మధ్యంతర ఎన్నికల సమయంలో ఏటూరునాగారం మండలం చెల్పాక గ్రామంలో ఎన్నికల విధుల కోసం వెళ్తున్న సమయంలో మావోయిస్టులు మాటువేసి పేల్చారు. ఈ ఘటనలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్సై కిషోర్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్‌తో పాటు అయిదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతిచెందారు.

జాకారం వద్ద మందుపాతర

ప్రస్తుత ములుగు జిల్లా జాకారం వద్ద 1996 అక్టోబరు నెలలో జరిగిన మందుపాతర పేలుళ్లలో ఏడుగురు పోలీసులు మృతిచెందారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా బందోబస్తుకు వెళుతున్న ట్రాఫిక్ సీఐ ఆకుల దామోదర్‌రావు ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు జాకారం వద్ద పేల్చేశారు. ఇందులో దామోదర్‌రావుతో పాటుగా హెడ్ కానిస్టేబుల్ జి.సారయ్య, కానిస్టేబుళ్లు ఎండీ మహమూద్ ఖాన్, డి.వినయ్‌కుమార్, పోశికంటి రమేశ్, సి.గోవర్ధన్, ఎం.అశోక్ మృతిచెందారు.

● 1992లో స్టేషన్‌ఘన్‌పూర్ విశ్వనాథపురం వద్ద జరిగిన బాంబు పేలుడులో 13 మంది మృతి చెందారు. ఇందులో 12 మంది బీఎస్ఎఫ్ జవాన్లు కాగా ఒకరు డ్రైవర్ ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల అతిపెద్ద విధ్వంసంగా పోలీసులు ఈ ఘటనను పేర్కొంటారు.



ప్రభుత్వ ప్రయోజనాలు

● మావోయిస్టుల చేతిలో మృతిచెందిన అమరవీరుల కుటుంబ సభ్యుల్లో అర్హత ఉన్న ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తారు.

● సర్వీస్ కాలం వేతనం మృతుడి సతీమణికి చెల్లిస్తారు.

● ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఇస్తారు.

● ఇంటి స్థలం మంజూరు చేస్తారు.

● 2005లో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమ సంఘం ఏర్పాటైంది. దీని ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఏర్పాట్లు చేశాం..



- అంబర్ కిశోర్ ఝా, పోలీసు కమిషనర్

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు ఓపెన్ హౌస్ లాంటి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పోలీసుల విధులు, కర్తవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఈ నెల 22న హనుమకొండ, 23న వరంగల్, 24 మామునూరు, 25వ తేదీ పోలీసు కమిషనరేట్, 26న వర్ధన్నపేట, 27 స్టేషన్‌ఘన్‌పూర్, 28 నర్సంపేట, 29 పరకాల, పోలీసు డివిజన్ కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తాం.

పైపులైన్ పగిలి.. భారీగా తాగునీటి వృథా



ఖమ్మం రోడ్డులో పెట్రోల్ పంపు ఎదుట..



మాజీ ఎమ్మెల్యే నరేందర్ నివాసం ముందు రోడ్డుపై..

వరంగల్ జిల్లా ఇసుకఅడ్డా ఖమ్మం రోడ్డులోని పెట్రోల్ పంపు ఎదుట శనివారం అర్ధరాత్రి బల్దియా ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో పెద్దఎత్తున తాగునీరు వృథా అయ్యింది. అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు లీకేజీ వరద ఆగలేదు. భారీ వర్షం పడినట్లు తాగునీరు ఏరులై పారింది. ఇసుకఅడ్డా నుంచి వరంగల్ అండర్‌బ్రిడ్జి మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఇంటివరకు నీరు నిలిచింది. లీకేజీని బల్దియా అధికారులు గుర్తించినా.. రంగశాయిపేట, శంభునిపేట, ఖిలావరంగల్, కరీమాబాద్, ఉర్సు, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్ తదితర ప్రాంతాలకు తాగునీటి విడుదల చేయడం వల్ల ప్రధాన పైపులైన్‌కు పడిన లీకేజీని నియంత్రించడం కష్టమైంది. ఆదివారం సాయంత్రం వరకు అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేశాక.. లీకేజీ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో సోమవారం నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, శివనగర్(వరంగల్)

రైతు ఇంట.. కొలువుల పంట



తల్లిదండ్రులతో కుమారులు మధు, మనోజ్

రఘునాథపల్లి, న్యూస్‌టుడే : ఓ రైతు కుటుంబం ఇంట.. కొలువుల పంట పండుతోంది.. ఆరుగాలం కష్టించి కుమారులను చదివిస్తే వారిద్దరూ పోటీ పడుతూ వరుసగా కొలువులు సాధిస్తున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన కౌడగాని మైసారావు వినోద దంపతుల కుమారులు మనోజ్, మధు ఒకరు మూడు, మరొకరు నాలుగు ఉద్యోగాలు సాధించి ప్రశంసలందుకుంటున్నారు. చిన్న కుమారుడు మధు ఈ ఏడాది జులై 20న సింగరేణి నిర్వహించిన జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షకు హాజరై ఈ నెల 18న వెలువడిన ఫలితాల్లో ఎంపికయ్యారు. ఆయన 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై కొంతకాలం విధులు నిర్వహించారు. ఆ వెంటనే న్యాయస్థానం నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై జనగామ కోర్టులో పనిచేశారు. తర్వాత హైకోర్టు నిర్వహించిన ఎగ్జామినర్ పరీక్షరాసి ఉన్నత ఉద్యోగం సాధించి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అంతటితో ఆగకుండా పెద్ద ఉద్యోగంలో చేరాలనే పట్టుదలతో సింగరేణిలో జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షలో నెగ్గాడు.. పెద్ద కుమారుడు మనోజ్ తమ్ముడు మధుతోపాటే పంచాయతీ కార్యదర్శి కొలువు సాధించారు. మెరుగైన ఉద్యోగం కోసం సాగునీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్ పరీక్ష రాసి ఎంపికయ్యారు. విధులు నిర్వహిస్తూనే.. సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని మండల గణాంకాధికారి(ఎంపీఎస్‌వో) పరీక్ష రాసి అంతకంటే పెద్ద ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆయన దేవరుప్పుల మండల రెవెన్యూ కార్యాలయంలో గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్యం, పట్టుదల ఉంటే ఉద్యోగ పరీక్షలు ఎంత కఠినమైనా సాధించవచ్చని సోదరులు మధు, మనోజ్ తెలిపారు.

పర్యాటక ప్రాంతాల సందర్శన



గణపురం కోటగుళ్లలో శిక్షణ శిబిరం వాలంటీర్లు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో ఆదేశాల మేరకు రామప్పలో కొనసాగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొన్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్లు ఆదివారం రామప్ప నుంచి పాండవులగుట్ట, కోటగుళ్ల సందర్శన చేశారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, పర్యాటక శాఖ, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరో రోజు ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అనంతరం పర్యాటక ప్రాంతాల సందర్శన చేశారు. ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవుల గుట్ట చేరుకున్నారు. పాండవుల గుట్ట ప్రాశస్త్యం గురించి స్వయంగా తెలుసుకున్నారు. అక్కడ నుంచి గణపురంలోని కాకతీయ కట్టడమైన కోటగుళ్లను పరిశీలించారు. ఆలయ నిర్మాణం, ప్రత్యేకతను చూశారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, శిక్షణ శిబిరం ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, పర్యాటక, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ.. 75 శాతమే!

● 12 వేల మంది రైతుల వివరాలు లేవు..

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

రుణమాఫీ కాని అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయగా.. చాలా మందికి వర్తించలేదని ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించింది. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమం చేపట్టారు. శనివారంతో ఈ కార్యక్రమం పూర్తికాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 శాతమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 81 శాతం జరగ్గా, అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాలో 60 శాతమే పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 48,297 కుటుంబాలకు గాను 36,279 కుటుంబాల నిర్ధారణ పూర్తయింది.. ఇంకా 25 శాతం మిగిలిపోవడం గమనార్హం.. వారందరికీ రుణమాఫీ కానట్లేనని అధికారులు అంటున్నారు. మరోవైపు వందశాతం పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పూర్తయ్యేదని అన్నదాతలు అంటున్నారు.

రూ.2312.01 కోట్ల రుణమాఫీ

రుణమాఫీకి సంబంధించి మూడు విడతల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2.63 లక్షల మంది రైతులకు రూ.2312.01 కోట్లను మాఫీ చేశారు. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 59,140 మంది అన్నదాతలకు రూ.516.91 కోట్లు, అత్యల్పంగా ములుగు జిల్లాలో 18,696 మంది రైతులకు రూ.165.53 కోట్లు మాఫీ అయ్యాయి.

క్షేత్రస్థాయిలో ఇలా..

రైతు పంట రుణమాఫీ కార్యక్రమానికి సంబంధించి పథకానికి అర్హులై ఉండి రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ చాలా మంది రైతులకు వర్తించలేదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ అర్హులైన కుటుంబాల నిర్ధారణ చేపట్టారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి పంచాయతీ, రైతు వేదికల్లో రేషన్ కార్డులేని కుటుంబ సభ్యుల నిర్ధారణ చేపట్టారు. కుటుంబ సభ్యులందరితో సెల్ఫీ తీసుకుని ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో కుటుంబ సభ్యుల నిర్ధారణ వివరాలు

జిల్లా	కుటుంబ సభ్యుల లక్ష్యం	నమోదు	శాతం	రుణమాఫీ పొందిన రైతులు	రుణం మొత్తం (రూ. కోట్లలో)
హనుమకొండ	8359	6934	79.30	49598	408.18
భూపాలపల్లి	5815	4713	81.04	22357	277.31
వరంగల్	8252	6263	75.90	59640	474.76
జనగామ	9947	7762	78.03	54458	469.32
మహబూబాబాద్	10937	6652	60.82	59140	516.91
ములుగు	4987	3955	79.30	18696	165.53

● జిల్లా ● కుటుంబ సభ్యుల లక్ష్యం ● నమోదు ● శాతం ● రుణమాఫీ పొందిన రైతులు ● రుణం మొత్తం (రూ. కోట్లలో)



భూపాలపల్లిలో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పూర్తికాకపోవడానికి కారణాలివే..

● సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు గ్రామానికి వెళ్లిన సందర్భంలో సదరు రైతు కుటుంబం ఇతర ప్రాంతాల్లో ఉండటం.. వారికి సమాచారం అందించినా రేపు, మాపు అంటూ దాటవేస్తుండటం.

● రుణమాఫీ మరణించిన వ్యక్తులపై ఉండటంతో వారి మరణ ధ్రువపత్రం అందించడంతో పాటు ఆధార్ కార్డు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. మరణించిన వ్యక్తి ధ్రువపత్రం సదరు కుటుంబ సభ్యులు సకాలంలో అందించకపోవడం.

● రుణమాఫీలో విదేశాల్లో ఉంటున్న వారి పేర్లు కూడా ఉన్నాయి. అలాంటి వారు ఇక్కడకు వచ్చి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకునేందుకు ఆసక్తి చూపకపోవడం.

● ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ కుటుంబ నిర్ధారణకు సంబంధించి సమాచారం అందించినా స్థానికంగా లేకపోవడం, ఆధార్ సమస్య, ఆదాయ పన్ను కడుతున్నవారు ముందుకు రాలేకపోయారని అన్నారు.

అండర్-23 క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-23 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖంత్ మైదానంలో నిర్వహించిన పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన జట్లు హాజరయ్యాయి. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌లో క్రికెట్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఓరుగల్లులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మైదానం నిర్మాణం ఆవశ్యకతను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆయన క్రికెట్ ఆడి సందడి చేశారు. వరంగల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, రఘురాం, ఉపేందర్, వెంకటేశ్వర్‌రావు, అభినవ వినయ్, మట్టెడ కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ జట్టు గెలుపు

హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో వరంగల్, మహబూబాబాద్ జట్లు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 29.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మహబూబాబాద్ జట్టు 30 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసి విజయం సాధించింది.

హనుమకొండ ఘన విజయం

మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో హనుమకొండ, జనగామ జిల్లా జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హనుమకొండ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 307-10 పరుగులు చేసింది. జట్టులో రోహిత్‌రెడ్డి 84, వశిష్ట 49 పరుగులతో రాణించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జనగామ జట్టు 27 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది.



ఆట ఆడేస్తా!

ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో ఆదివారం మంత్రి సీతక్క సందడిచేశారు. బాల్య స్నేహితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన ఆమె స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అప్పుడే మైదానంలోకి వచ్చిన పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన వంటలు పరిశీలించి పరిశుభ్రంగా, రుచిగా వండాలని అక్కడి సిబ్బందికి సూచించారు. – న్యూస్‌టుడే, తాడ్వాయి

దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంచరీ (ఏటీసీ) కోర్సులను ఏర్పాటు చేయనుంది. తొలి విడతలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం, భూపాలపల్లిలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఈ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్‌డీడీ సీతారాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తూ ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని బలంగా ఢీకొనగా, ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన బోయ నర్సింహ(20), వనపర్తి జిల్లా మదనాపురానికి చెందిన చీరోలు భరత్(22)లు కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఓ గుత్తేదారు కింద ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం సొంత పనుల నిమిత్తం దేవరుప్పులకు వచ్చే క్రమంలో గొల్లపల్లి శివారు వద్ద రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని ఢీకొనడంతో కింద పడిపోయారు. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న బోయ నర్సింహ, చీరోలు భరత్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ట్రాలీలో ప్రయాణిస్తున్న కొంగరి భాస్కర్, రాపాక రేణుక, రాపాక ఉప్పలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సదానందచారి


ప్రమాణ స్వీకారోత్సవంలో జిల్లా స్వర్ణకారుల సంఘం కమిటీ సభ్యులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా భూపాలపల్లి పట్టణానికి చెందిన రామగిరి సదానందచారి ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన కట్ట శంకర్‌మూర్తి తో పాటు ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు ఆదివారం స్థానిక సుభాష్‌కాలనీలోని ఓ వేడుకల మందిరంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు విజయమూరి రాఘవచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో స్వర్ణకారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వర్ణకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, చంద్రశేఖర్, ఈశ్వరాచారి, కొండపాక రాజేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం

చిట్యాల, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. జడల్‌పేట నుంచి భావుసింగ్‌పల్లి, భావుసింగ్‌పల్లి నుంచి ముచినిపర్తి వరకు, జూకల్ శివారులో రూ.3.81 కోట్లతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనులను నాణ్యతగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు పథకాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వం పూర్తిగా అవినీతి పాలన చేసినట్లు విమర్శించారు. అప్పులతో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూట్ల తిరుపతి, చిట్యాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, కిష్టయ్య, శంకర్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

గణపురం, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి, ధర్మరావుపేటలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మరావుపేట నుంచి నగరంపల్లి అప్పయ్యపల్లి వరకు రూ. 4 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి, లక్ష్మారెడ్డిపల్లిలో రూ.25 లక్షలతో నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతోందని గ్రామ పట్టణం అనే తేడా లేకుండా అభివృద్ధి పథంలో ముందుకు పోయేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుడు పైడిపెల్లి సాయివెంకట్, తాళ్ల వరుణ్‌ను ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సత్కరించారు. సెప్టెంబరులో కేరళ రాష్ట్రంలో నిర్వహించిన సీనియర్ నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో వాటర్ పోలో విభాగంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జరిగిన పోటీల్లో భూపాలపల్లికి చెందిన సాయివెంకట్ 5 గోల్స్ చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును కైవసం చేసుకున్నారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సబ్ జూనియర్ 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో తాళ్ల వరుణ్ పతకం సాధించాడు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. స్విమ్మింగ్ కోచ్ పాక శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు జల్ది రమేష్, ప్రశాంత్‌రెడ్డి, వేణు, తిరుపతి, శ్రీరాములు, పైడిపెల్లి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక డంప్.. అక్రమార్కులు పరారీ..?

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో ఇసుకను డంప్ చేసి అక్రమార్కులు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. మండలంలోని ఓ ఇసుక క్వారీ నుంచి అనుమతులు లేకుండా మూడు ఇసుక లారీలు శనివారం రాత్రి బయలుదేరాయి. పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తుండడంతో మహదేవపూర్ శివారు ప్రాంతంలో అక్రమార్కులు ముందస్తుగా జాగ్రత్తపడి రోడ్డు పక్కన ఇసుకను డంప్ చేసి వెళ్లిపోయాయి. ఈ విషయమై మహదేవపూర్ ఎస్సై కె.పవన్‌ను సంప్రదించగా ఇసుక డంప్ వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. నిఘా నేత్రాలను పరిశీలన చేస్తున్నామని, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

లారీ పట్టివేత

కాటారం, న్యూస్‌టుడే: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై ఎం.అభినవ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మద్దులపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. డ్రైవర్ పోలీసులను చూసి పారిపోయాడని, కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

‘రైతు భరోసాపై కాంగ్రెస్ మోసం’

టేకుమట్ల: సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా ఇస్తానని చెప్పి మరిచారని భారాస కార్మిక శాఖ మండలాధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో భారాస నాయకులు ధర్నా నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు కోటి, మహేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిట్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని చిట్యాల మండల కేంద్రంలో భారాస నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు భరోసా వచ్చే పంటకు అమలు చేస్తామని చెప్పడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు సాగర్, పీఏసీఎస్ ఛైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రవీందర్, యూత్ అధ్యక్షుడు నవీన్, కుమార్, రాజేందర్, రవీందర్‌రావు, మల్లక్క, మహేందర్, వెంకటేశ్, నారాయణరావు, తిరుపతి, శంకర్, ఆనంద్‌రెడ్డి ఉన్నారు.

గణపురం: గణపురం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. వానాకాలం పంట నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీని 100 శాతం అమలు చేయాలన్నారు. మండలాధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మీనర్సింహరావు, పూర్ణచందర్‌రావు, మధుసూధన్‌రావు, శ్రీనివాస్, ఆగమ్మ, కుమారస్వామి, భద్రయ్య, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: భారాస మండలాధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతు భరోసా పథకంలో భాగంగా రూ. 15 వేలు ఇస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నిధులు లేవు మళ్లీ యాసంగి పంటకు ఇస్తామని మాయ మాటలు చెబుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, నిరుద్యోగులను మోసం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కొడారి రమేష్‌యాదవ్, నాయకులు నహరి వెంకట్‌రెడ్డి, దానబోయిన రాములు, చంద్రమౌళి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, కుమార్, రహీం, స్వామి, లవయ్య, సంపత్, జగ్గారావు ఉన్నారు.


చిట్యాలలో ప్రధాన రహదారిపై

రేగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో భారాస నేతలు రాస్తారోకో చేశారు. మండలాధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. తిరుపతిరావు, తిరుపతిగౌడ్, ప్రభాకర్, రమేశ్, హమీద్, వెంకన్న, చంద్రారెడ్డి, భిక్షపతి, అశోక్ పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి జాతీయ రహదారిపై భారాస నేతలు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల అమలు విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతు భరోసా, పూర్తి స్థాయిలో రుణమాఫీ అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రామా చేస్తున్నారని దుయ్యబట్టారు. పోలీసులు ధర్నాను విరమింపజేసి నాయకులను ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో జోడు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, కిరణ్, శ్రావణ్, సడవలి, సతీష్ పాల్గొన్నారు.


గణపురంలో..


రేగొండలో..


కాటారంలో..


మొగుళ్లపల్లిలో..

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



భూపాలపల్లి, న్యూస్‌టుడే: కొంత మంది స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు, కార్మిక కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయం ఆవరణలో ఆదివారం వరంగల్‌కు చెందిన ఎన్‌ఎస్‌ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే పలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులతో శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని, ముఖ్యంగా సింగరేణి కార్మికులు, జెన్‌కో సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు వారి హెల్త్ కార్డుతో వరంగల్ సమీపంలోని ఎన్‌ఎస్‌ఆర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు పొందవచ్చన్నారు. ఇందుకోసం సింగరేణి, జెన్‌కో సంస్థల సీఅండ్ ఎండీలతో అనుమతి వచ్చిందన్నారు. సుమారు 452 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు నాగేశ్వర్‌రావు, రాజిరెడ్డి, ఫణీంద్ర, ఆగిస్ట్యా, దిలీప్, సంపత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మధు, అప్పం కిషన్, కొంరయ్య, సాంబమూర్తి, రమేష్, దాట్ల శ్రీను, ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లక్ష్మీ దేవరకు గంగా స్నానం


గోదావరి నుంచి లక్ష్మీ దేవరను తీసుకువస్తూ..

కాళేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని పల్లులలో ప్రజల ఇలవేల్పు లక్ష్మీదేవరను ఆదివారం నియమ నిష్ఠలతో కొలిచారు. గోదావరి వద్ద స్నానం ఆచరించిన అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ఉత్సాహంగా వాలీబాల్ ఎంపిక పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ జ్ఞానేశ్వర్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రతిభ ఆధారంగా అండర్-17 విభాగంలో బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి సారంగపాణి తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పీఈటీ సంఘాల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రఘువీర్, పీఈటీలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1992-93 లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులు అయిత రాజయ్య, సుదర్శన్, వెంకటరామనర్సయ్య, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, నాగరాజు, ఇక్బాల్, హరినారాయణలను సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు తమ గుర్తుగా రూ.30 వేల విలువైన సౌండ్ సిస్టం బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బొగ్గు బాయి ముచ్చట్లు

సందడిగా పూర్వ సమ్మేళనం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి జీడీకే 6-ఎ గనిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు. 6-ఎ గనిలో కలిసి పనిచేసిన వారు వేరు వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. స్థానిక గంగానగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో కలుసుకుని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

సీనియర్లకు డిప్యుటేషన్లు ఇవ్వాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సీనియర్ కార్మికులకు డిప్యుటేషన్లు కల్పించాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్మిక సంఘాల ఐక్య వేదిక సమావేశంలో మాట్లాడారు. జూనియర్ కార్మికులకు డిప్యుటేషన్లు కల్పిస్తూ సీనియర్లను విస్మరిస్తున్నారని, దీనిపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. కంపెనీలో 40 సంవత్సరాలు సేవలందించిన కార్మికులను మారుపేర్ల కారణంగా ఇబ్బందులకు గురిచేస్తుందని, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించకుండా పక్కన పెట్టిందన్నారు. విజిలెన్సు విచారణల పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రియాజ్‌అహ్మద్, ఐ.కృష్ణ, రాములు, నారాయణ, నరేశ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులపై భారాస మొసలి కన్నీరు

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కాంట్రాక్టు కార్మికులపై భారాస నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, పార్టీ కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు వైనాల రాజు అన్నారు. ఆర్జీ-2 పరిధి ఓసీపీ-3లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పదేళ్లలో కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనాలకు నోచుకోలేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై నిరంతరం చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో తోట చంద్రయ్య, ఆరెల్లి కొమురయ్య, ముత్యాల శ్రీనివాస్, దాసరి శివ, తులసిరామ్, కాటం సత్యం, గాజుల శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రొ. జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఫౌండేషన్ ఛైర్మన్ మారుతి తెలిపారు. సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. 60 మందికి కంటి ఆపరేషన్ అవసరమని వైద్యుడు పూదరి దత్తాగౌడ్ నిర్ధారించినట్లు తెలిపారు. వారికి త్వరలో కరీంనగర్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్, శ్రీనివాస్, ప్రతాప్, రాజు, సదానందం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి పీహెచ్‌సీలో ప్రసూతి సేవలు



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మొగుళ్లపల్లి పీహెచ్‌సీలో ప్రసూతి సేవలను ప్రారంభించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాణి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో ప్రసూతి సేవలు ప్రారంభించామని, రంగాపూర్ గ్రామానికి చెందిన మహిళ సాధారణ కాన్పులో 2.8 కిలోల బరువుతో ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ఆమె వివరించారు. ఇక నుంచి ఆసుపత్రిలో ప్రసూతి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మండలంలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్యులు విద్యాసాగర్, స్టాఫ్‌నర్స్ కల్పన, క్రిష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


గుండ్రాత్‌పల్లిలో..

కాటారం, న్యూస్‌టుడే: నూతన రహదారులకు నిధుల మంజూరు చేయడంతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. గుండ్రాత్‌పల్లి నుంచి ఉట్లపల్లి వరకు రహదారికి రూ.2 కోట్ల నిధుల మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్హర్, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని చిగురుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. కొయ్యూర్ ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రవితేజ (20) మహదేవపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుంటానని ఈ నెల 5న ఇంటికి తీసుకొచ్చాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి బంధువులు రవితేజపై దాడి చేసి అమ్మాయిని తీసుకెళ్లారు. దీంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి భూపాలపల్లిలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. శనివారం ఇంటికి తీసుకొచ్చిన కొద్ది సేపటికి రవితేజ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనాథ వృద్ధాశ్రమానికి బియ్యం పంపిణీ



భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో అమృత వర్షిణి అక్షర సేవా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథ వృద్ధాశ్రమానికి ఆదివారం స్థానిక చేయూత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేసినట్లు నిర్వాహకురాలు సారవత్ శాంతి తెలిపారు. అదే విధంగా ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం తక్కళ్లగూడెం, సారలమ్మ గూడెం ప్రాంతాల్లోని 60 మంది గొత్తికోయల కుటుంబాల పిల్లలకు ఉచితంగా నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులతో పాటు రెండు క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు.

బడుల్లో బాలికా సాధికారత సంఘాలు


దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం ఉన్నత పాఠశాల బాలికలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు(పాత చిత్రం)

దేవరుప్పుల, న్యూస్‌టుడే: దేశంలో కఠినమైన చట్టాలు, శిక్షలు ఉన్నా ఇంకా కొన్ని ప్రాంతాల్లో బాలికల పట్ల అనుచిత ధోరణితో చూసేవారు అధికంగానే ఉన్నారని, ఈ క్రమంలో బాలికలపై ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలోనే ‘బాలికా సాధికారత సంఘాల’ను ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. పలు ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సగటు ఆడపిల్ల ఎదుర్కొనే ఇబ్బందుల నివారణపై బహుళ ప్రచారం చేసేందుకు ఈ సంఘాలు దన్నుగా నిలవాలని ప్రభుత్వం ఆశిస్తుంది. వచ్చే నెల(నవంబర్) 4వ తేదీ లోపు వీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

సంఘాల లక్ష్యాలు ఇలా..

☛ కౌమార బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు సంఘంలో తోటివారి నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ప్రాథమిక దశలోనే ప్రతిఘటించడం సహా పాఠశాల స్థాయిలోనే ఆడపిల్లల్లో కనిపించే శారీరక మార్పుల పట్ల అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

☛ ఆయా సంఘాలకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఛైర్మన్‌గా, మహిళా ఉపాధ్యాయురాలు, ప్రతి సెక్షన్ నుంచి ఇద్దరు బాలికలు, స్థానిక పోలీసు స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్ ఎక్స్‌టర్నల్ సభ్యురాలుగా ఉంటారు. వీరంతా నెలకోసారి సమావేశమై బాలికల్లో బిడియం పోగొట్టి మనోధైర్యం కల్పించి ఎలాంటి అనుచితాలు జరిగినా తమ గమనానికి తీసుకురావాలని సూచిస్తారు. ప్రతి మాసంలో జరిగే సమావేశాల్లో ఏడు అంశాలపై అవగాహన కల్పిస్తారు. అండగా ఉంటామనే భావన పెంపొందిస్తారు. అలాగే బడిలో గ్రీవెన్స్‌బాక్స్ ఏర్పాటుచేసి ప్రధానోపాధ్యాయుడి సమక్షంలో వీటిని తెరిచి సమస్యలు తెలుసుకుంటారు.

☛ జిల్లా స్థాయిలో జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలో మరో కమిటీ ఉంటుంది. పాఠశాల స్థాయిలో బ్యానర్ తగు కరపత్రాల ముద్రణ తదితర ఖర్చుల కోసం రూ. 500 లను ప్రభుత్వం అందజేయనుంది. ప్రతినెలా జరిగే సమావేశంలో అందిన సమాచారం తాలూకు పురోగతి, తాజా విషయాలపై ప్రస్తావిస్తారు.

విప్లవ సాంస్కృతిక ఉద్యమంతోనే మార్పు

నర్సంపేట, న్యూస్‌టుడే: దేశంలో పెచ్చరిల్లుతున్న హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు, భూస్వామ్య సంస్కృతికి ప్రత్యామ్నాయంగా సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణంతో ముందుకు సాగాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.జాలన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న పిలుపునిచ్చారు. నర్సంపేటలోని రాయల రమేశ్ నగర్(సిటిజన్స్ క్లబ్)లో ఆదివారం జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో వారు పాల్గొని మాట్లాడారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారి, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా బలమైన విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించి.. తద్వారా ప్రజలను జాగృతం చేయాలన్నారు. ప్రజా కళలు అంతరించడం వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ‘కళ కాసు కోసం కాదని.. అది ముమ్మాటికి ప్రజల కోసమని’ పేర్కొన్నారు. విప్లవ సాంస్కృతిక ఉద్యమం కోసం పోరాడి అమరులైన వారికి జోహార్లు అర్పించారు. అంతకుముందు అమరవీరుల స్తూపం కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా సభావేదిక వరకు ప్రదర్శనగా వచ్చారు. సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్, ఆహ్వాన సంఘం నాయకులు డా.జగదీశ్వర్, ఐలయ్య, ప్రముఖ కవి, రచయిత యోచన, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాధ, అరుణోదయ సమాఖ్య నాయకులు అలీ, కోటేశ్వర్‌రావు, ఆహ్వాన సంఘం సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు శివారులోని పంటపొలంలో కొంత మంది వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. సదరు రైతులకు నష్టపరిహారం అందించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం దెబ్బతిన్న పొలాన్ని వారు పరిశీలించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



హేమాచల క్షేత్రంలో భక్తుల పూజలు

మల్లూరు(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరు గుట్టపై శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, సికింద్రాబాద్, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.